సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం, 26, ఆగస్టు, 2025



చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20 వేలు, కనిష్టంగా రూ.8 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.28

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.28, కనిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.9°/20.8°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

'పరిష్కార వేదిక'కు 240 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 240 అర్జీలు అందాయి. కలెక్టర్ చేతన్ అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణులు ఎంతో నమ్మకంతో వ్యయ, ప్రయాసలకోర్చి కలెక్టరేట్ వరకూ వచ్చి అర్జీలు ఇస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్‌ఎల్‌ఏ, రీఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ సూర్యనారాయణరెడ్డి, స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

28న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

- నేటి మధ్యాహ్నం నుంచి కాల్‌లెటర్ల డౌన్‌లోడ్‌కు అవకాశం



సెంటర్‌ను పరిశీలిస్తున్న పరిశీలకులు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–25కు ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 28న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్, జిల్లా పరిశీలకులు సుబ్బారావు, జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. అనంతపురం రూరల్ ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని సోమవారం జిల్లా పరిశీలకులు సుబ్బారావు పరిశీలించారు. పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరు కానుండడంతో ఏమాత్రం ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి సర్టిఫికెట్‌ను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. జోన్ ఆఫ్ కన్సడరేషన్‌లోకి వచ్చిన అభ్యర్థులకు, వారు దరఖాస్తు చేసుకున్న అన్ని రకాల పోస్టులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. అభ్యర్థులు వారి వ్యక్తిగత డీఎస్సీ–2025 లాగిన్ ఐడీల ద్వారా మంగళవారం మధ్యాహ్నం నుంచి కాల్ లెటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. కాల్‌లెటర్లలోని సూచనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఇటీవల జారీ చేసిన కుల ధ్రువీకరణపత్రం, ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులైతే వైకల్య ధ్రువీకరణ పత్రం, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించిన మూడుసెట్ల జిరాక్స్ కాపీలు, ఐదు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలన్నారు. అభ్యర్థులు 28న ఉదయం 9 గంటలకు పరిశీలన కేంద్రానికి చేరుకోవాలని డీఈఓ ప్రసాద్‌బాబు సూచించారు. వెరిఫికేషన్‌కు హాజరుకాకముందే సంబంధిత సర్టిఫికెట్లను వెబ్‌సైట్‌లో వ్యక్తిగత డీఎస్సీ లాగిన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎంపిక మెరిట్, అర్హత, రిజర్వేషన్ నియమ నిబంధనల మేరకే జరుగుతుందన్నారు. వారి వెంట విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మునీర్‌ఖాన్, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

విషం ఇచ్చి చంపేయండి

"పింఛన్ ఇవ్వండి... లేకపోతే ఇంత విషం ఇచ్చి చంపేయండి. రీవెరిఫికేషన్ పేరుతో పింఛన్ తొలగిస్తే ఏ పనీ చేయలేని మేము ఎలా బతకాలి. మా గోడు ఎవరు వింటారు. కలెక్టర్ బయటికి రావాలి. సీఎం స్పందించాలి. మరోసారి విచారణ చేసి.. అర్హులైన దివ్యాంగులందరికీ పింఛన్ అందజేయాలి. నాడు ఉన్న పర్సెంటేజీ.. నేడు లేకపోవడం ఏంటి? డాక్టర్లు తప్పిదం చేస్తే.. దివ్యాంగులకు అన్యాయం చేస్తారా?"

– కలెక్టరేట్ ఎదుట నిరసనలో దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు ఇంతియాజ్

"కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అందరినీ ఇబ్బందులకు గురి చేస్తోంది. రీ వెరిఫికేషన్ పేరుతో వేలాది మంది దివ్యాంగులకు పింఛన్ రాకుండా కుట్రలు చేస్తోంది. అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలని నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంక్షించారు. అయితే నేడు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం.. దివ్యాంగులపై రాజకీయ కుట్రలు చేస్తోంది. నడవలేని స్థితిలో ఉన్న వారికి సైతం రాజకీయ రంగు పూసి వారి పేరు పింఛన్ జాబితా నుంచి తొలగించింది"

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

- పింఛన్ రద్దుతో దివ్యాంగుల ఆక్రోశం
- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు
- 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు
- ఆందోళనకు మద్దతు తెలిపిన వైఎస్సార్ సీపీ
- పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- పోలీసులు అడ్డంకులు సృష్టించిన కలెక్టరేట్‌కు చేరుకున్న వైనం
- దివ్యాంగులతో కలిసి ధర్నా.. కలెక్టర్ చేతన్‌కు వినతిపత్రం అందజేత



దివ్యాంగులతో కలిసి కలెక్టరేట్‌కు వస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

సాక్షి, పుట్టపర్తి

రీవెరిఫికేషన్ పేరుతో వేలాది మంది దివ్యాంగుల పింఛన్‌లు తొలగిస్తూ కూటమి సర్కార్ నోటీసులివ్వడంపై బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్కార్ తీరును నిరసిస్తూ సోమవారం జిల్లా కేంద్రం పుట్టపర్తిలో కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. రీ వెరిఫికేషన్ పేరుతో తమకు అన్యాయం చేయవద్దని వేడుకున్నారు. దివ్యాంగుల నిరసనకు వైఎస్సార్ సీపీ మద్దతు తెలిపింది. ఈ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ కలెక్టరేట్‌కు వచ్చి దివ్యాంగులతో కలిసి బైఠాయించారు. అర్హులైన దివ్యాంగులందరికీ తక్షణమే పింఛన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాబోయే రోజుల్లో దివ్యాంగుల తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తామని ఉషశ్రీ చరణ్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విధి వంచితులైన వారి పట్ల మానవత దృక్పథంతో వ్యవహరించాల్సింది పోయి..వారిని తీవ్రంగా వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పైనే ఆధారపడి జీవించే దివ్యాంగులకు రీవెరిఫికేషన్ పేరుతో అన్యాయం చేయడం బాధాకరమన్నారు. పింఛన్ అందక.. జీవితం భారమై కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన ఉదంతాలను ఉషశ్రీచరణ్ ప్రస్తావించారు.

అడుగడుగునా అడ్డగింత..

దివ్యాంగులకు మద్దతుగా కలెక్టరేట్‌కు వస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ను పుట్టపర్తిలో పోలీసులు అడ్డుకున్నారు. అడుగడుగునా ఆంక్షలు విధించి కలెక్టరేట్ వద్దకు రాకుండా చేయాలని చూశారు. దీంతో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, అర్బన్ సీఐ శివాంజనేయులు తీరుపై ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. పోలీసు అధికారులు నిబంధనల మేరకు ఉద్యోగం చేయాలని.. కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గరాదని సూచించారు. అనంతరం ఆమె కాన్వాయ్ నుంచి దిగి.. దివ్యాంగులతో కలిసి ద్విచక్ర వాహనంపై కలెక్టరేట్‌కు చేరుకున్నారు. తమకు అండగా నిలిచేందుకు వచ్చిన ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఉషశ్రీచరణ్ దివ్యాంగులతో కలిసి 'సీఎం డౌన్ డౌన్' అంటూ కలెక్టరేట్ ప్రాంగణంలో నినాదాలు చేశారు. కలెక్టరేట్‌లోనికి వెళ్లనీయకపోవడంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. తర్వాత పోలీసులు అనుమతించడంతో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ఉన్న కలెక్టర్ చేతన్‌కు దివ్యాంగులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఏ ఆధారమూ లేని దివ్యాంగులకు అన్యాయం చేయవద్దన్నారు. రీవెరిఫికేషన్‌తో సంబంధం లేకుండా గతంలో పింఛన్ తీసుకుంటున్న దివ్యాంగులందరికీ పింఛన్ అందించాలని కోరారు.



వీరికి అర్హత లేదా: కలెక్టరేట్‌కు వచ్చిన పింఛన్ కోల్పోయిన దివ్యాంగులు



పింఛన్లు పునరుద్ధరించాలని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

సచివాలయ ఉద్యోగుల బాహాబాహీ

- విరిగిన పంచాయతీ కార్యదర్శి చేయి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న పంచాయతీ కార్యదర్శి ఫారుక్

గోరంట్ల: కేంద్రం అమలు చేస్తున్న స్వామిత్వ యోజన సర్వే సందర్భంగా ఏర్పడిన వివాదంలో ఇద్దరు సచివాలయ ఉద్యోగులు పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో ఓ పంచాయతీ కార్యదర్శి చేయి విరిగింది. వివరాల్లోకి వెళితే... మండలపరిధిలోని కమ్మవారిపల్లి గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీలో సోమవారం పంచాయతీ కార్యదర్శి ఫారుక్ నేతృత్వంలో సర్వేయర్, వీఆర్‌ఓ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ స్వామిత్వ యోజనకు సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఫారుక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలాజీ మధ్య వృత్తిపర వివాదం చెలరేగింది. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పంచాయతీ కార్యదర్శి ఫారుక్ కిందపడగా, చేయి విరిగింది. దీంతో తోటి ఉద్యోగులు ఫారుక్‌ను గోరంట్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శి ఫారుక్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాలాజీ కూడా ఈ ఘటనపై ఎంపీడీఓతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి ఫారుక్ తనపై దాడి చేశారని పేర్కొన్నారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్య



మృతుడు చౌదయ్య

ధర్మవరం అర్బన్: కుటుంబ పోషణకు చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక ఓ చేనేత కార్మికుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే..ధర్మవరం శివానగర్‌కు చెందిన పామిశెట్టి చౌదయ్య(60) చేనేత కార్మికుడు. మగ్గంపై ఆధారపడి కుటుంబాన్ని పోషించుకునే వాడు. మగ్గంపై ఎంతగా పనిచేసినా రాబడి అంతంతమాత్రంగానే ఉండటం... ప్రభుత్వం నుంచి సాయం కూడా లేకపోవడంతో కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చే మర్గమూ కనిపించక మదన పడేవాడు. ఇటీవల కురిసిన వర్షాలతో మగ్గం పనికూడా చేయలేక ఇబ్బందులు పడ్డారు. రోజుగడవడమే ఇబ్బందిగా మారింది. ఇక అప్పులు తలచుకుని భయపడ్డాడు. ఈ నేపథ్యంలోనే జీవితంపై విరక్తి చెందిన చౌదయ్య సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు సంజీవరాయుడు, కుమార్తె జయలక్ష్మి ఉన్నారు. పిల్లలిద్దరికీ వివాహాలు చేశాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మవరం వన్ టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

ధర్మవరంలో గన్‌కల్చర్!

- నియోజకవర్గంలో భయాందోళనలు రేపుతున్న పరిస్థితులు
- బత్తలపల్లి మండలంలో టీడీపీ నాయకుల మధ్య గొడవలు
- పోలీసుల సోదాల్లో పిస్టల్, మారణాయుధాల స్వాధీనం
- దందాలు, దౌర్జన్యాలు చేసేందుకే మారణాయుధాలు సమకూర్చుకుంటున్న వైనం
- పాత రోజులు పునరావృతమవుతున్నాయా..?



సాక్షి టాస్క్‌ఫోర్స్: రెండు దశాబ్దాలుగా ప్రశాంతంగా ఉన్న ధర్మవరం నియోజకవర్గంలో మళ్లీ పాత రోజులు పునరావృతమవుతున్నాయా..? గతంలో 'పరిటాల' హయాంలో జరిగిన నరమేధం మళ్లీ పురుడు పోసుకుంటోందా..? రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి సత్యకుమార్ నియోజకవర్గంలో ఇంత అశాంతి, దౌర్జన్యాలకు ఆలవాలంగా మారుతుండటం దేనికి సంకేతం..?

బెదిరింపుల కోసమే మారణాయుధాలు..

మొన్నటికి మొన్న బత్తలపల్లి మండలం నల్లబోయినపల్లి గ్రామంలో బొగ్గు విక్రయాల్లో కమీషన్ల కోసం టీడీపీలో రెండు గ్రూపులు కొట్టుకున్నాయి. ఇనుప రాడ్లు, వేటకొడవళ్లతో దాడులు చేసుకున్నాయి. దీంతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ఘటనలో పోలీసులు నిందితుడు విశ్వనాథ్ నాయుడు, అతడి అనుచర వర్గానికి చెందిన వారి నుంచి వేటకొడవళ్లు, ఇనుపరాడ్లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు కౌశిక్ ఇంట్లో సోదాలు జరుపగా ఇండియన్ మేడ్ పిస్టల్ దొరికింది. పక్కా స్కెచ్‌తోనే టీడీపీ నాయకులు తమ ఇళ్లలో మారణాయుధాలను నిల్వ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ధర్మవరంలో వసూళ్ల దందా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ధర్మవరంలోని పట్టు వ్యాపారులు, రియల్టర్లకు బెదిరింపులు ఎక్కువయ్యాయి. కూటమి పార్టీలకు చెందిన కొందరు నేతలు బెదిరింపులతో రూ.కోట్లు వసూళ్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ దందా కోసం టీడీపీ నాయకులు ముఠాలుగా ఏర్పడి మారణాయుధాలతో బెదిరిస్తున్నారని బాధితులు చెబుతున్నారు.

పాత రోజులు పునరావృతం..

గతంలో పరిటాల కుటుంబం ఫ్యాక్షన్ నరమేధం, దందాలు వంటి చీకటి రోజులు చూశామని, మళ్లీ అలాంటి రోజులు వచ్చాయని ప్రజలు భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో చిన్నపాటి భూమి కొనాలన్నా.. వాటిని వన్–బీలోకి ఎక్కించాలన్నా.. టీడీపీ నాయకులకు డబ్బులు ముట్టజెప్పాల్సిందేనని వాపోతున్నారు. ఆనాటి పాత రోజులు మళ్లీ రావడం దురదృష్టకరమని పలువురు మేధావులు విమర్శిస్తున్నారు. సత్యకుమార్‌ను గెలిపించినందుకు తగిన శాస్తి జరిగిందంటున్నారు.

ముదిరిన 'బొగ్గు' వ్యవహారం

బత్తలపల్లి: బొగ్గు వ్యాపారులతో కమీషన్ల వ్యవహారం ముదిరి పాకాన పడుతోంది. కమీషన్ల కోసం ఆదివారం రాత్రి తెలుగు తమ్ముళ్లు దాడులకు దిగిన విషయం తెలిసిందే. కానీ టీడీపీ నేతలు 'బొగ్గు' వ్యవహారాన్ని కప్పి పెట్టారు. మరో ఘటనను తెరపైకి తెచ్చారు. ఆదివారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించి టీడీపీ నేత విశ్వనాథనాయుడుతో పాటు మరో ఐదుగురిపై హత్యాయత్నం కింద కేసు నమోదు కాగా, అక్రమ ఆయుధాలు కలిగిన ఉన్నాడంటూ మరో నాయకుడిపై కూడా కేసు నమోదైంది.

హత్యాయత్నం కేసు నమోదు

బత్తలపల్లి ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. బత్తలపల్లి మండలం కట్టకిందపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేత విశ్వనాథనాయుడు వద్ద నల్లబోయనపల్లి గ్రామానికి చెందిన బెస్త కౌశిక్ కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు. తన అవసరాల నిమిత్తం యజమాని వద్ద రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. తర్వాత ఈ మొత్తాన్ని కౌశిక్ చెల్లించినా ప్రాంసరీ నోటు తిరిగి ఇవ్వకుండా విశ్వనాథనాయుడు తన వద్దే పెట్టుకుని తరచూ డబ్బు కోసం ఒత్తిడి చేస్తుండడంతో కౌశిక్ పని మానేశాడు. అయినా పనికి రావాలంటూ విశ్వనాథనాయుడు వేధించేవాడు. అయినా కౌశిక్ పనికిరావడం లేదు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన సాకే సాంబశివుడు అలియాస్ సాంబతో కలసి కౌశిక్ టాటా సఫారీ కారులో బత్తలపల్లికి వెళుతుండగా నల్లబోయనపల్లి గ్రామం దాటిన తర్వాత విశ్వనాథనాయుడు తన అనుచరులతో అడ్డుకున్నాడు. కారులో ఉన్న కౌశిక్‌ను బయటకు లాగి రాడ్లు, కొడవళ్లతో దాడి చేయడమే కాక, కారునూ ధ్వంసం చేశారు. ఆ సమయంలో కాపాడేందుకు వెళ్లిన సాంబను కూడా చంపుతామని బెదిరిస్తూ రాడ్లతో దాడి చేశారు. గ్రామస్తులు జోక్యం చేసుకుని క్షతగాత్రులను 108 వాహనంలో ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు విశ్వనాథనాయుడుతో పాటు మరో ఐదుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమంగా మారణాయుధాలు.. కౌశిక్‌పై కేసు నమోదు

కౌశిక్ అక్రమంగా ఆయుధం కలిగి ఉన్నాడనే సమాచారం మేరకు ఆదివారం రాత్రి 10.45 గంటలకు రెవెన్యూ అధికారులు, పెద్ద మనుషుల సమక్షంలో తనిఖీలు చేపట్టామని ఎస్‌ఐ సోమశేఖర్ తెలిపారు. కంట్రీ మేడ్ పిస్టల్ లభ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

- చంద్రబాబు మోసాలను ఊరూరా వివరించాలి
- వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి



మడకశిర: నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌రెడ్డి

మడకశిర: ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు చంద్రబాబు మోసాలను ఊరూరా వివరించాలని వైఎస్సార్ సీపీ హిందూపురం పార్లమెంట్ పరిశీలకుడు రమేష్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకొచ్చే బాధ్యత అందరిపై ఉందన్నారు. సోమవారం పట్టణంలోని షాదీమహల్‌లో పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ గ్రామ పంచాయతీ, వార్డుల స్థాయిల్లో ఏర్పాటు చేసిన పార్టీ అనుబంధ కమిటీల నూతన సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ...పార్టీ అనుబంధ కమిటీల్లోని సభ్యులు వచ్చే ఎన్నికల్లో కీలక పాత్ర పోషించాలన్నారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. 14 నెలల కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. వీటన్నింటినీ ప్రజలకు వివరించి మళ్లీ వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పని చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శులు వజ్ర భాస్కర్‌రెడ్డి, మధుమతిరెడ్డి మాట్లాడుతూ.. వైఎస్ జగన్ హయాంలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలు, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను చంద్రబాబు ఎలా మోసం చేశారో ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయాలి: ఈరలక్కప్ప

నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ... గ్రామ, వార్డుల స్థాయిల్లోని వివిధ కమిటీలకు నూతనంగా ఎన్నికైన సభ్యులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలను తెలుసుకుని పరిష్కరించి ప్రజలకు దగ్గర కావాలని సూచించారు. సమావేశంలో మాజీ మంత్రి నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రతినిధి జీను మహేష్, జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, ఆయా మండలాల పార్టీ ఇన్‌చార్జ్‌లు గంగుల సుధీర్‌రెడ్డి, భారతిరెడ్డి దేశాయి, సాయిలీల, లింగారెడ్డి, పట్టణ కన్వీనర్ బోయ సతీష్‌కుమార్, మండల కన్వీనర్లు నరసింహారెడ్డి, డీఎల్ యంజారేగౌడ్, త్రిలోక్‌నాథ్, శ్రీనివాస్, రామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ జయరాజ్, ఎంపీపీలు ఈరన్న, సత్యనారాయణరెడ్డి, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, నియోజకవర్గ స్థాయి వివిధ విభాగాల అధ్యక్షులు, పంచాయతీ, వార్డుల ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన పార్టీ అనుబంధ కమిటీల నూతన సభ్యులు

క్లుప్తంగా

కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించండి



డీపీఓకు వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పుట్టపర్తి అర్బన్: పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించాలని డీపీఓ సమతను జిల్లా గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం డీపీఓను కలసి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సెలవులు, పండుగ సమయాల్లో సర్వేల పేరుతో పని చేయాల్సి వస్తుండడంతో విశ్రాంతి లేక మానసిక ఒత్తిడికి లోనవుతున్నామన్నారు. స్వామిత్వ పథకంలో భాగంగా క్షేత్ర స్థాయిలో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, వీటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రామమోహన్, శ్రావణ్‌కుమార ఈశ్వర్, జైపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జిల్లాలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అండతో హత్యాయత్నం

- ఒత్తిళ్లకు తలొగ్గి కేసును నీరుగారుస్తున్న పోలీసులు
- న్యాయం చేయాలంటూ ఎస్పీకి దళితుల వినతి

పుట్టపర్తి టౌన్: మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అండ చూసుకుని టీడీపీ నాయకులు తమపై హత్యాయత్నానికి పాల్పడ్డారని, కేసు నమోదు చేసి న్యాయం చేయాల్సిన పోలీసులు సైతం ఎమ్మెల్యే ఒత్తిళ్లకు తలొగ్గి అన్యాయం చేస్తున్నారంటూ ఎస్పీ రత్న వద్ద మడకశిర మండలం ఆర్.అనంతపురం గ్రామానికి చెందిన దళితులు వాపోయారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ రత్నకు వినతి పత్రం అందజేసిన అనంతరం విలేకరులతో వారు మాట్లాడారు. వివరాలు..

ఆర్.అనంతపురం గ్రామానికి చెందిన దళిత ఉగ్ర నరసింహులుకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో జీవనం సాగిస్తున్నారు. 2018లో గ్రామంలో వినాయక చవితి పండుగ రోజున చిన్న పాటి అంశంలో ఉగ్ర నరసింహులుతో అదే గ్రామానికి చెందిన ఎస్సీ వర్గీయులు అంజనేయులు, మారుతి, రామాంజనేయులు గొడవపడ్డారు. మరుసటి రోజు మూడు ద్విచక్ర వాహనాల్లో వచ్చిన ఆరుగురు నరసింహులుతో పాటు ఆయన కుమారులపై దాడి చేశారు. దీనిపై అప్పట్లో బాధితుల ఫిర్యాదు మేరకు మడకశిర



విలేకరులతో మాట్లాడుతున్న దళిత ఉగ్ర నరసింహులు, కుటుంబసభ్యులు

పోలీసులు కేసు నమోదు చేశారు. తిరిగి 2019లోనూ మరోసారి గొడవపడడంతో పరస్పర ఫిర్యాదుల మేరకు పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. అయితే పాత గొడవలు వద్దని 2024లో పెద్ద మనుషులు సమక్షంలో రాజీ పడి కేసులకు లోక్ అదాలత్‌లో పరిష్కారం పొందారు.

ఈ ఏడాది జూన్ 6న నరసింహులుపై టీడీపీ నాయకులు హత్యాయత్నం చేశారు. ఆయన కుమార్తెలు, కుమారులపై దాడులకు తెగబడ్డారు. ఈ విషయంగా మడకశిర పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ అంశంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు జోక్యం చేసుకుని ఒత్తిడి చేయడంతో కేసును స్టేషన్‌కే పరిమితం చేస్తూ పోలీసులు నీరుగార్చారు. 'పార్టీ మాది, కేసు లేదు.. ఏమి లేదు.. ఏం చేసుకొంటావో చేసుకో' అంటూ స్థానిక టీడీపీ నాయకుడు కన్నా, మరికొందరు తరచూ బెదిరింపులకు దిగుతున్నారు. దౌర్జన్య పరు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

లకు ఎమ్మెల్యే అండగా నిలవడంతో పోలీసులు సైతం నోరు మెదపడం లేదు. దీంతో తనకు, తన కుటుంబసభ్యులకు స్థానిక టీడీపీ నేతల నుంచి ప్రాణహాని ఉందని, వారి బారి నుంచి రక్షణ కల్పించి, హత్యాయత్నం చేసిన వారిపై కేసు నమోదు చేసి, న్యాయం చేయాలని ఎస్పీని కోరినట్లు బాధితులు తెలిపారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 80 వినతులు..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 80 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఆదినారాయణ, లీగల్ అడ్వైజర్ సాయినాథరెడ్డి పాల్గొన్నారు.

మట్టి వినాయకుడిని పూజించాలి

- జిల్లా ప్రజలకు కలెక్టర్ చేతన్ పిలుపు

ప్రశాంతి నిలయం: వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ మట్టితో చేసిన వినాయకుడినే పూజించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 'పర్యావరణ అనుకూల వినాయక చతుర్థి' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వినాయక చవితి విశిష్టతను కాపాడేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సహజ రంగులతో చేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకుందామని పిలుపునిచ్చారు. చెరువులు, జలవనరులకు నష్టం కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసే విగ్రహాలను ఏర్పాటు చేయకపోవడమే మేలన్నారు. నీటి వనరుల కాలుష్యాన్ని నివారించడానికి పర్యావరణ అనుకూలమైన వినాయక విగ్రహాలను ఉపయోగించాలన్నారు. వినాయక మండపాలకు అనుమతులు



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

జారీ చేసేటప్పుడు, విగ్రహాల ఏర్పాటు సమయంలో రెవెన్యూ, మున్సిపల్, జిల్లా పంచాయతీ, పోలీస్, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ అధికారులు కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలన్నారు. అనంతరం మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

'చిలకం' చెబితేనే కరెంట్ కనెక్షన్ ఇస్తారంట

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఓ రైతు ఫిర్యాదు

ప్రశాంతి నిలయం: ''నా తోటలోని బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని కోరితే.. చిలకం మధుసూదన్‌రెడ్డి అనుమతులు లేకపోతే మేం కనెక్షన్ మంజూరు చేయలేమని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. కోర్టు తీర్పు ఉన్నా.. అధికారులు బేఖాతరు చేస్తున్నారు. అధికారుల చర్యలతోనే నా చీనీతోట నీరులేక ఎండిపోతోంది. మీరైనా న్యాయం చేయండి'' అంటూ ఓ రైతు కలెక్టర్ చేతన్‌ను వేడుకున్నారు. వివరాల్లోకి వెళితే... ధర్మవరం మండలం ముచ్చురామికి చెందిన రైతు విశ్వనాథరెడ్డికి గ్రామంలో ఐదుఎకరాల పొలం ఉంది. ఏడాదిన్నర క్రితం బోరు వేసి కరెంట్ కనెక్షన్ కోసం నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్నాడు. ఆరు నెలల క్రితం సర్వీసు మంజూరు చేసిన అధికారులు అవసరమైన పరికరాలు అందజేశారు. అయితే అప్పటి నుంచి ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో రైతు విశ్వనాథరెడ్డి పలుమార్లు మండల, డివిజన్, జిల్లా స్థాయి విద్యుత్ అధికారులను కలిసి తన పొలంలో చీనీచెట్లు ఎండి పోతున్నాయని, త్వరగా ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ ఇవ్వాలని వేడుకున్నారు. అయినా వారు స్పందించలేదు. చివరకు చిలకం మధుసూదన్‌రెడ్డిని కలవాలని, ఆయన చెబితేనే కనెక్షన్ ఇస్తామని సలహా ఇచ్చారు. చేసేది లేక విశ్వనాథరెడ్డి నాలుగుసార్లు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సైతం అర్జీలు ఇచ్చాడు. అయినా ఫలితం



సమస్యల పరిష్కార వేదిక మందిరంలో బైఠాయించిన రైతు విశ్వనాథరెడ్డి తదితరులు

లేకపోవడంతో హైకోర్టుకు వెళ్లి అనుమతులు తెచ్చుకున్నాడు. అయినా విద్యుత్ అధికారులు కోర్టు ఉత్తర్వులను లెక్కచేయలేదు. దీంతో సోమవారం మరోసారి కలెక్టరేట్‌కు వచ్చిన రైతు విశ్వనాథరెడ్డి తన సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఎదుట బైఠాయించాడు. విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన దిగాడు. తన పొలానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోతే ఆత్మహత్యే చేసుకుంటానన్నాడు. స్పందించిన కలెక్టర్ టీఎస్ చేతన్ అక్కడే ఉన్న విద్యుత్ శాఖ ఎస్‌ఈని ఆరా తీశారు. రైతుతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో త్వరలోనే విద్యుత్ కనెక్షన్ ఇస్తామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంపత్ కుమార్ హామీ ఇవ్వడంతో రైతు ఆందోళన విరమించాడు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేగాటిపల్లి సురేష్‌రెడ్డి, రైతు రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

బత్తలపల్లి: భూ వివాదంలో ఇరు వర్గా ల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు... ధర్మవరం రూరల్ మండలం తిమ్మనకొట్టాల గ్రామానికి చెందిన గోపాల్, ఆంజనేయులు, మంజు ఆదివారం మధ్యాహ్నం తమ పొలం వద్ద జేసీబీతో పనులు చేయిస్తున్న సమయంలో తిరుపాలు, శివయ్య, మునెయ్య అక్కడకు చేరుకుని ఆ భూమిలో తమకూ హక్కు ఉందంటూ కట్టెలతో దాడికి పాల్పడ్డారు. ఘటనలో గోపాల్, ఆంజనేయులు, మంజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీఆర్ఎంటీ సమస్యలు పరిష్కరించాలి

బత్తలపల్లి: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ (సీఆర్ఎంటీ)ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూనియన్ నాయకులు రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉమ్మడి అనంతపురం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో సీఆర్ఎంటీ యూనియన్ నాయకులు సోమవారం గుంటూరులో ఉన్న రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు, విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాసరావును కలిసి వినతిపత్రాలు అందజేశారు. సీఆర్ఎంటీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సాయి, అశోక్, రమేష్, శివయ్య, హారస్



సమగ్ర శిక్ష రాష్ట్ర ఎస్పీడీ శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న సీఆర్ఎంటీ నాయకులు

బాషా, ఓబులేసు, నరసింహ, కృష్ణప్ప, మురళి, శివానంద తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు బలిగొన్న చేపల వేట

ధర్మవరం అర్బన్: చేపల వేట సరదా ఓ వ్యక్తి ప్రాణాలను బలిగొంది. పోలీసులు తెలిపిన మేరకు.. ధర్మవరంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన సాకే రామాంజనేయులు (40)కు భార్య లక్ష్మీనరసమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బేల్దారి పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆదివారం సాయంత్రం ధర్మవరం చెరువు వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లిన రామాంజనేయులు ప్రమాదవశాత్తు కాలు జారి చెరువు నీటిలో పడి మునిగిపోయాడు. సోమవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లిన స్థానికులు నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి రామాంజనేయులుగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని ధ్రువీకరించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



రామాంజనేయులు (ఫైల్)

చావు లేదంటూ ఊజీ గుళికలు మింగి...

చెన్నేకొత్తపల్లి: ప్రపంచం అంతమైనా తనకు చావు లేదని, కావాలంటే నిరూపిస్తానంటూ ఊజీ గుళికలు మింగి ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... సీకేపల్లి మండలం ప్యాదిండి పంచాయతీ నామాల గ్రామానికి చెందిన ఆంజనేయులు (64)కు భార్య శివమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా మతి స్థిమితం లేక గ్రామంలో తిరుగాడేవాడు. ఈ క్రమంలో సోమవారం అందరూ చూస్తుండగా తనకు చావు లేదని, ప్రపంచం అంతమైనా తాను మాత్రం జీవించే ఉంటానని, కావాలంటే నిరూపిస్తానంటూ గట్టిగా అరుస్తూ పొలం చల్లేందుకు తీసుకొచ్చిన ఊజీ గుళికలు తీసుకుని గబుక్కున నోట్లోకి వేసుకున్నాడు. గమనించిన కుమారుడు వెంకటేష్ అడ్డుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఊజీ మాత్రలు మింగిన వృద్ధుడిని స్థానికులు వెంటనే ధర్మవరంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆంజనేయులు మృతి చెందాడు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆంజనేయులు (ఫైల్)

మారణాయుధాలతో దాడి

ఆత్మకూరు: భూవివాదంలో రెండు వర్గాలుగా విడిపోయి మారణాయుధాలతో దాడి చేసుకోవడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు.. కనగానపల్లి మండలం భానుకోట, కొండపల్లి గ్రామాలకు చెందిన వారికి ఆత్మకూరు మండలం గొరిదిండ్ల రెవెన్యూ పరిధిలో పొలాలు ఉన్నాయి. కొంత కాలంగా భానుకోట, కొండపల్లి గ్రామాలకు చెందిన వారి మధ్య భూ వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో సోమవారం గొరిదిండ్ల సమీపంలోని వారి భూమిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గొడ్డళ్లతో పరస్పర దాడులు చేసుకోవడంతో వెంకటేష్, రఘు, భూపతి, రామదాసుతో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనం ద్వారా అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

ఆటో బోల్తా... మహిళ మృతి

నల్లమాడ: స్థానిక పుట్టపర్తి రహదారిపై మంగినిగట్లు గ్రామ సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో నల్లమాడ మండలం కుటాలపల్లి తండాకు చెందిన ఎస్.ముత్యాలమ్మ (45) మృతి చెందింది. మరికొందరు గాయపడ్డారు. తండాకు చెందిన పలువురు కూలీలు బేల్దారి పనుల కోసం సోమవారం ఉదయం ఆటోలో పుట్టపర్తికి బయలుదేరారు. మంగినిగట్లు దాటిన తర్వాత కల్వర్టు వద్ద ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలో బోల్తాపడింది. ఎస్.ముత్యాలమ్మ, మంగమ్మ, రామచంద్ర, శివమ్మ, శీనానాయక్, మహేష్ నాయక్, సాకమ్మ, లలితమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో నల్లమాడలోని సీహెచ్‌సీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ముత్యాలమ్మ మృతి చెందినట్లు నిర్ధారించారు. క్షతగాత్రుల్లో మంగమ్మ, రామచంద్ర, శివమ్మ, శీనానాయక్‌ను మెరుగైన చికిత్స కోసం కదిరికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతురాలు ముత్యాలమ్మ

మా ప్రేమకు నువ్వే అడ్డు!

- యువతిని బెదిరించిన ప్రేమికులు
- మనస్తాపంతో ఆత్మహత్య

అనంతపురం: 'నువ్వే మా ప్రేమకు అడ్డు.. నువ్వు లేకపోతే మేం ప్రశాంతంగా ఉంటాం. నువ్వు చనిపోవాల్సిందే' అంటూ ఓ యువతిని ఆత్మహత్య చేసుకునేలా ప్రేమికులు ప్రేరేపించిన ఘటన సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గొందిపల్లి గ్రామానికి చెందిన పూజారి స్వాతి (21) అనంతపురంలోని నలంద డిగ్రీ కళాశాలలో యూజీ మూడో సంవత్సరం చదువుతోంది. ఓ వైపు చదువుకుంటూనే మరో వైపు దీప్తు రక్త పరీక్ష కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. అక్కడ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న అరుణ్ కుమార్, మరో టెక్నీషియన్ అయిన యువతితో స్వాతి స్నేహపూర్వకంగా ఉంటూ వచ్చింది. ఈ క్రమంలో అరుణ్‌కుమార్, స్వాతి ప్రేమలో పడ్డారు. విషయం తెలుసుకున్న సదరు యువతి సోమవారం ఉదయం స్వాతికి ఫోన్ చేసి మందలించింది. 'నా ప్రియుడిని ఎలా ప్రేమిస్తున్నావు.. మేమిద్దరమూ ముందు నుంచి ప్రేమలో ఉన్నాం. నీవు అడ్డు వస్తున్నావు. ఈ విషయం ల్యాబ్‌లో, మీ హాస్టల్‌లో అందరికీ చెబుతాను' అని బెదిరించింది. అదే ధోరణిలో అరుణ్‌కుమార్ కూడా ఆ యువతికి వత్తాసు పలుకుతూ స్వాతిని బెదిరించాడు. దీంతో మనస్తాపం చెందిన స్వాతి... సోమవారం ఉదయం 7.30 గంటలకు తాను ఉంటున్న బాలాజీ లేడీస్ హాస్టల్‌లో గదిలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్వాతి తండ్రి పూజారి నాగభూషణం ఫిర్యాదు మేరకు అనంతపురం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



పూజారి స్వాతి (ఫైల్)

జేవీవీ జిల్లా కమిటీ ఎంపిక

ధర్మవరం: జనవిజ్ఞాన వేదిక జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు జేవీవీ నాయకులు డాక్టర్ ఆదిశేషు సోమవారం తెలిపారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా డాక్టర్ టీఎం బషీర్, డాక్టర్ ఈటీ రామ్మూర్తి, వాసుదేవరెడ్డి, జిల్లా అధ్యక్షుడిగా కదిరి నరసారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ధర్మవరం లోకేష్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్‌రెడ్డి, చైతన్య, గంగిరెడ్డి, గౌస్ లాజం, రామకృష్ణ, కార్యదర్శులుగా నారాయణస్వామి, మహేంద్రరెడ్డి, మంజుల, ఎంకే నబీ ఎంపికయ్యారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



పతకాలను చూపుతున్న జిల్లా విద్యార్థులు

ధర్మవరం అర్బన్: తూర్పు గోదావరి జిల్లా పత్తిపాడు వేదికగా ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపి బంగారు పతకాలు దక్కించుకున్నారు. ఈ మేరకు జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డి సోమవారం తెలిపారు. విద్యార్థులు మమత, అభిలాష్, యుగంధర్, రఘు, చేతన్‌గౌడ్, జస్వన్‌కుమార్, భాను కేశవ్ ప్రతిభ చూపి నాలుగు బంగారు పతకాలతో పాటు ద్వితీయ స్థానంలో ఇద్దరు, తృతీయ స్థానంలో నలుగురు, నాల్గో స్థానంలో ముగ్గురు, ఐదో స్థానంలో ముగ్గురు నిలిచారన్నారు.

గణేష్ ఉత్సవాలు సజావుగా సాగేలా హామీ

హిందూపురం: వినాయక చవితి ఉత్సవాలను హిందూపురంలో 9 రోజుల పాటు సజావుగా నిర్వహిస్తామంటూ ఎస్పీ రత్నకు లిఖితపూర్వకంగా ఏపీ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు హామీనిచ్చారు. ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలను అందించాలని కోరారు.

'సెక్టోరియల్' అభ్యర్థుల మార్కులు బహిర్గతం చేయాలి : యూటీఎఫ్

పుట్టపర్తి: జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ పోస్టుల నియామకానికి ఎంపికైన అభ్యర్థుల మార్కులను బహిర్గతం చేయాలని కలెక్టర్‌ను యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ చేతన్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. సమగ్ర శిక్షలో ఖాళీగా ఉన్న సెక్టోరియల్ పోస్టులకు 120 మంది దరఖాస్తు చేసుకోగా 34 మందిని అర్హులుగా ఎంపిక చేస్తూ వారికి గురువారం బుక్కపట్నంలోని డైట్ కళాశాలలో ఇంటర్వ్యూలకు పిలిచారన్నారు. మార్కులు బహిర్గతం చేసి పారదర్శకంగా పోస్టులు భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.